



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

జాడ లేని స్థిరీకరణ నిధి

- ఖర్చులు కూడా రాని పంటలు - టమోటా, ఉల్లి రైతుల కన్నీరు

ప్రజాశక్తి - పత్తికొండ

రాష్ట్ర ప్రభుత్వం రైతు లేనిదే రాజ్యం లేదని, వైసిపి ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట వేశామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గొప్పలు చెప్తున్నా రైతులను ఆదుకోవడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘం నాయకులు విమర్శిస్తున్నారు. పంటకు పెట్టిన ఖర్చులు కూడా రాక ఉల్లి, టమోటా రైతులు నలిగిపోతున్నారు. ఒకపక్క టమోటా మరోపక్క ఉల్లి సాగు చేసిన రైతులు ధరలు లేక లబోదిబో అంటున్నారు. ఖరీఫ్ సీజన్లో పత్తికొండ, దేవనకొండ, తుగ్గలి, మద్దికెర మండలాలలో టమోటా పంటను 6292 ఎకరాలలో 4821 మంది రైతులు సాగు చేశారు. ఉల్లి పంటను 17వేల ఎకరాలలో 10 వేల మంది రైతులు సాగు చేశారు. ఎకరాకు 20 వేల నుంచి 30 వేల వరకు పెట్టుబడి పెట్టి సాగు చేశారు. టమోటా, ఉల్లి సాగు చేసిన రైతులు అష్ట కష్టాలు పడి పంటను మార్కెటుకు తీసుకువస్తే తెచ్చిన పంటకు ధర లేక ఆందోళన చెందుతున్నారు. టమోటా కిలో రూ.2, ఉల్లి క్వింటా రూ.800 పలకడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు.



గొర్రెలకు వదిలేసిన ఉల్లి పంట

పంటకు పెట్టిన పెట్టుబడులు రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి, రవాణా చార్జీలు కూడా రావడం లేదని కొందరు రైతులు పంట పొలాలను దున్నేశారు. పత్తికొండ మండలం రామచంద్రాపురం గ్రామంలో ఓ రైతు ఉల్లి పంటను ట్రాక్టర్ తో దున్నేసి మరో పంట వేయడానికి సిద్ధమయ్యారు. దేవనకొండ మండలంలో గత నెల అక్టోబర్లో ఓ రైతు చేతికి వచ్చిన పంటను గొర్రెలకు మేపుకోవడానికి వదిలేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే టమోటా రైతులు పరిస్థితి దయనీయంగా ఉంది . టమాట కోత కోసుకొచ్చి మార్కెట్ కి తీసుకువస్తే పత్తికొండ మార్కెట్లో టమోటా వ్యాపారులు తక్కువ ధరలకు కొనుగోలు చేయడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి టమోటా, ఉల్లికి మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఖర్చులు కూడా రావడం లేదు



ఖరీఫ్ సీజన్లో 4 ఎకరాలలో ఉల్లి పంట సాగు చేశాను. ఎకరాకు రూ.30వేల పెట్టుబడి పెట్టాను. ఉల్లి పంటను కోత కోసి గ్రేడింగ్ చేసి సిద్ధంగా ఉంచాను. ఉల్లికి ధర లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాను.

- కొట్టాల రవి, హోసూరు, పత్తికొండ మండలం.

మోడీకి ఎందుకు సాగిలా పడుతున్నారు?

- వైసిపి నాయకులు సమాధానం చెప్పాలి
- వామపక్షాల సూటి ప్రశ్న
- మోడీ రాకను నిరసిస్తూ రెండోరోజు నిరసన

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

ఆంధ్ర రాష్ట్రానికి ద్రోహం చేసిన ప్రధాని నరేంద్ర మోడీకి ఎందుకు స్వాగతం పలకారో వైసిపి నాయకులు రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని వామపక్ష పార్టీల నేతలు ప్రశ్నించారు. ఇప్పటికైనా మోడీకి దాసోహం అనకుండా రాష్ట్ర విభజన హామీల కోసం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ముందుకు రావాలని వైసిపిని డిమాండ్ చేశారు. శనివారం విశాఖపట్నంకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ గో బ్యాక్ అంటూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్, సిపిఐ నగర నాయకులు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రసూల్ మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని, విభజన హామీలు అమలు చేస్తామని, రాజధాని అభివృద్ధికి నిధులు ఇస్తామని వెనకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని మాట ఇచ్చి మాట తప్పారన్నారు. ఆంధ్ర రాష్ట్రప్రజల ప్రాణ త్యాగాలతో నిర్మించిన విశాఖ స్టీల్ ప్లాంట్ను ప్రైవేటీకరణ చేస్తామని చెప్పిన నరేంద్ర మోడీని ఎందుకు ప్రశ్నించడం లేదని, ప్రత్యేక హోదా ఇస్తామని మాట తప్పినందుకా? విభజన హామీలు ఇవ్వకుండా ద్రోహం చేసినందుకా? ఎందుకు సాగిలాపడి ఆహ్వానం పలికారని నిలదీశారు. ఏమాత్రం రాష్ట్రప్రజల పట్ల, రాష్ట్ర అభివృద్ధి పట్ల విశ్వాసం ఉన్న ఏ వ్యక్తి కూడా రాష్ట్రానికి ద్రోహం చేసిన ప్రధాని నరేంద్ర మోడీకి వైసిపి ప్రభుత్వం ఎర్ర తివాచీపరిచి ఘనంగా ఆహ్వానించడం సిగ్గుచేటన్నారు. ఈ ప్రభుత్వం అసలు రూపాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. వైసిపి, తెలుగుదేశం, జనసేన లు నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా, బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని, ఇది వీరి అసలు నైజమని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఈ మూడు రాజకీయ పార్టీల అవకాశవాద రాజకీయాలను గమనించాలన్నారు. ప్రజలను నట్టేట ముంచుతారని అందు కోసమే ప్రజలే ఈ రాష్ట్రాన్ని రక్షించుకోవడానికి ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటన చేయడం సిగ్గుచేటైన విషయమని, నరేంద్ర మోడీ గో బ్యాక్ అని నిన దించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు జగన్నాథం, సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి రాముడు, సిపిఎం సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

దళితుల సామాజిక, ఆర్థిక మార్పే కెవిపిఎస్ అజెండా

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎస్. దేవసహాయం, ఎమ్‌డి.ఆనంద్ బాబు - 37 మందితోకర్నూలు జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

దళితుల సామాజిక, ఆర్థిక మార్పే ప్రధాన అజెండాగా మంత్రాలయంలో జరిగిన కెవిపిఎస్ ఆరవ జిల్లా మహాసభ తీర్మానించిందని, అందుకు అనుగుణంగా ఆయా తీర్మానాలను ఆమోదించిందని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు తెలిపారు. 37 మందితో నూతన జిల్లా కమిటినీ, 15 మందితో ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకుందన్నారను. శనివారం కెవిపిఎస్ కర్నూలు జిల్లా కార్యాలయంలో నూతన కమిటీని, తీర్మానాలను విలేకరుల సమావేశంలో ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా ఎస్. దేవసహాయం, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎండి. ఆనంద్‌బాబును తిరిగి ఎన్నుకున్నారు. కోశాధికారిగా ఎస్‌జి.కృష్ణ (కాటికాపరి రంగం),ఉపాధ్యక్షులుగా పిఎస్. రాధాకృష్ణ (జిల్లా సెంటర్), బి.తిక్కప్ప (ఆదోని), బి. కరుణాకర్ (గోనేగండ్ల), డి.విజయమ్మ (మహిళ రంగం), ఎండి.శ్రీనివాసులు (ఉద్యోగ రంగం), హెచ్. చిన్న మారయ్య (కౌతాళం), సహాయ కార్యదర్శులుగా హెచ్ .జయరాజు (మంత్రాలయం), ఆర్ పెద్దబాబు (డప్పు రంగం), గిత్తరి రమేష్ (పత్తికొండ), ఆంధ్ర గురుస్వామి (కర్నూలు ఓల్డ్ సిటీ), ఎం. భాస్కర్ (కర్నూలు న్యూ సిటీ), కనకవీడు రాజు (నందవరం) లను నూతన ఆఫీస్ బేరర్లుగా ఎన్నుకున్నారు. మరో 22 మందిని జిల్లా కమిటి సభ్యులుగా ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

కెవిపిఎస్ 6వ జిల్లా మహాసభ దళితులు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలపై చర్చించిందన్నారు. పరిష్కారానికి అనేక రకాల తీర్మానాలను చేశామన్నారు. స్మశానాల్లో గుంతలు తీస్తూ కాటికాపరులుగా బతికే వృత్తిదారులను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, డప్పు కళాకారుల పెన్షన్‌ను రూ.ఆరువేలకు పెంచడంతోపాటు పెన్షన్ వయసు 45 సంవత్సరాలకు తగ్గించాలని, డప్పు కళాకారులు అందరికీ వయసుతో సంబంధం లేకుండా డప్పు, గజ్జలు, డ్రెస్సు, చర్మకారులు అందరికీ వృత్తి పరికరాలు ఇవ్వాలని, దళితుల ఆర్థిక స్థైర్యాన్ని పెంచేలా రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని, వివక్షను, అంటరానితనాన్ని ప్రభుత్వమే ప్రధాన అజెండాగా తీసుకుని నిర్మూలించాలని, దళితుల సంక్షేమ పథకాలను అమలు చేయాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లను అమలు చేయాలని, అట్రాసిటీ కేసుల్లో 41 సిఆర్‌పిసి కింద స్టేషన్ బెయిల్ ఇవ్వడాన్ని రద్దు చేయాలని, బసివిని వ్యవస్థను సంపూర్ణంగా నిర్మూలించి ఇప్పటికే ఉన్న బసివినులకు సంపూర్ణ పునరావాసం కల్పించాలని, స్కావెంజర్లకు బతుకు భద్రత కల్పించి స్కావెంజర్ నిర్మూలన చట్టాన్ని అమలు చేయాలనే తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు. దళితుల బతుకుల్లో సామాజిక ఆర్థిక మార్పే ప్రధాన అజెండాగా ముందుకు తీసుకొస్తూ ఉద్యమించేలా నవంబర్ 28న గొప్ప ప్రదర్శన వేలాది మందితో బహిరంగ సభ కర్నూలు నగరంలో నిర్వహించడానికి అవసరమైన సహకారాన్ని అన్ని వర్గాల ప్రజానీకం అందించాలని కోరారు. విలేకరుల సమావేశంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి.విజయమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆర్. పెద్దబాబు, ఆంధ్రగురుస్వామి, ఎం.భాస్కర్, కనకవీడు రాజు, జిల్లా కమిటీ సభ్యులు జె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





వలసే దిక్కా?

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రతి ఏడాదీ వర్షాలు సరిగ్గా పడక పంటలు పండకపోవడం వల్ల వ్యవసాయ కూలీలకు పనుల్లేక కర్నూలు జిల్లా నుంచి వలసలు పెద్ద ఎత్తున కనిపించేవి. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల, పత్తి పంటను గులాబీ పురుగు ఆశించడం వల్ల కర్నూలు జిల్లాలోని ఆదోని డివిజన్ పరిధిలో వ్యవసాయ కూలీలు, చిన్నకారు, కౌలు రైతులు వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో కురిసిన వర్షానికి పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. దాంతో చిన్న రైతులు నష్టాల పాలయ్యారు. కౌలు రైతులకు కనీసం కౌలు కూడా గిట్టలేదు. వ్యవసాయ కూలీలకు పని లేకుండా పోయింది. దీంతో కర్నూలు జిల్లాలో వలసలు పెద్ద ఎత్తున మొదలయ్యాయి. ఇప్పటి వరకూ 25 వేల మంది బతుకు కోసం వలస బాట పట్టారు. కోసిగి, ఎమ్మిగనూరు, నందవరం, హోళగుంద, పెద్దకడబూరు మండలాల నుంచి పట్నాలకు తరలి వెళ్లారు. ఒక్క కోసిగి మండలంలోనే 15 వేల మంది వలస వెళ్లారు. కర్నూలు జిల్లా నుంచి ప్రతి ఏడాదీ లక్షల్లో వలస వెళ్తున్నా వలసల నివారణకు అధికారులు చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఆ ప్రాంత ప్రజలకు వలసలే దిక్కయ్యాయి. వారికి స్థానికంగానే గిట్టుబాటయ్యే మొత్తం వచ్చేలా ఉపాధి చూపగలిగినప్పుడే వలసల నివారణ సాధ్యం అవుతుంది.

టమోటా రైతు విలవిల : టమోటా ధర రోజురోజుకూ పడిపోతుండడంతో సాగు చేసిన రైతులు గగ్గోలు పెడుతున్నారు. నెల రోజుల క్రితం ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా ధర పడిపోవడంతో రైతులు దిగులు పడుతున్నారు. గతంలో బాక్సు (25 కిలోలు) ధర రూ.500 పలికింది. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.100లోపే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కోత కూలిలు, రవాణ ఖర్చులు, కమీషన్ పోను రైతుకు ఏమాత్రం మిగలకపోవడంతో నష్టపోతున్నారు. అక్టోబర్‌లో కురిసిన వర్షాలకు టమోటా పంట పూర్తిగా దెబ్బతినడంతో దిగుబడులు భారీగా తగ్గాయి. ఆ సమయంలో ధరలు పెరిగాయి. ప్రస్తుతం కొన్ని రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండడంతో దిగుబడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం బాక్స్ ధర రూ.300లోపే పలుకుతుండటంతో కనీసం రవాణా ఛార్జీలు కూడా రావడం లేదు.

అవీ..ఇవీ..అన్నీ...

జిజిహెచ్ సెక్యూరిటీ గార్డులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నాలు నిర్వహించారు. నకిలీ పత్తి విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ 9వ మహాసభ నిర్వహించారు. ఆలూరులో సివిల్ సప్లయి హమాలీ సంఘం మహాసభ నిర్వహించారు. జిల్లాల్లో పిడిఎఫ్ అభ్యర్థులు బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థుల తరపున ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రజల గొంతుక వినిపించే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని కోరుతున్నారు. ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్ జిల్లాలో పర్యటించారు. తుగ్గలిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.





ఫుట్ బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సిఐ తబ్రేజ్ ం

క్రమశిక్షతోనే క్రీడాభివృద్ధి

ఫుట్ బాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్: క్రమశిక్షణతో గొప్ప క్రీడాకారులుగా రాణిస్తారని కర్నూలు మూడో పట్టణ సిఐ తబ్రేజ్ అభిప్రాయం సూచించారు. బి. క్యాంప్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఉదయం 7 ఏ సైడ్ ఇన్విటేషన్ ఫుట్ బాల్ ప్రైజ్ మనీ పోటీలు సిఐ ప్రారంభించారు. ఇజె క్రీయాషన్స్ వారు లండన్‌లో ఉద్యోగ రిత్యా స్థిరపడిన కర్నూలు మాజీ ఫుట్ బాల్ క్రీడాకారుడు టోనీ సౌజన్యంతో పోటీలు నిర్వహిస్తున్నారు. సిఐ తబ్రేజ్ , ఒలింపిక్ అధ్యక్షులు పి.విజయ్ కుమార్, జిల్లా ఫుట్‌బాల్ అధ్యక్షులు ముప్పరాజశేఖర్, చీఫ్‌కోచ్ ఎంఎన్‌వి. రాజు పాల్గొన్నారు. అతిథిలు మాట్లాడుతూ నగరంలో అనేక క్రీడా పోటీలు నిర్వస్తున్నారని అన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణ, నిబద్ధతతో ఉంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. సమాజంలో క్రీడాకారులకు ఉన్న గుర్తింపు వేరువారికి ఉండదని అన్నారు. ఫుట్‌బాల్ క్రీడాకారులు పరిచయ చేసుకొని, ఫుట్ బాల్‌ను కిక్ చేసి పోటీలను ప్రారంబించారు. ఈ పోటీలో వివిధ రాష్ట్రాలు, పలు జిల్లాల నుండి సుమారు 30 ఫుట్ బాల్ జట్లు పాల్గొన్నాయి.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎంఎన్‌వి.రాజు

జగనన్న క్రీడా సంబరాల పోస్టర్ విడుదల

కర్నూలు హాస్పిటల్ : జగనన్న క్రీడా సంబరాల పోస్టర్లను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి శనివారం తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 21న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జగనన్న క్రీడా సంబరాలు ఆటల పోటీలు నిర్వహించనున్నామన్నారు. పాణ్యం నియోజకవర్గంలో ఈనెల 15, 16, 17వ తేదీలలో పాణ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పాణ్యం నియోజకవర్గస్థాయి మెన్ అండ్ ఉమెన్ కబడ్డీ, ఉమెన్ అండ్ మెన్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా క్రీడల అధికారి ఎంఎన్‌వి.రాజు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు విజయకుమార్, పాణ్యం నియోజకవర్గ ఇన్చార్జ్ పెద్దపాడు హెచ్‌ఎం.వేణుగోపాల్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు : హాఫీజ్‌ఖాన్

పజాశక్తి - కర్నూలు క్రైం

సంక్షేమ పథకాల అమలుతోనే పేదల అభ్యున్నతి సాధ్యమవుతుందని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ. హాఫీజ్ ఖాన్ అన్నారు. శనివారం కర్నూలు నియోజకవర్గ పరిధిలోని 22వ వార్డు, బి.క్యాంపులోని 56 వ సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా, ప్రజల సుఖ సంతోషాలే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందన్నారు. వీధులలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. సమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో దేశంలోనే ఆదర్శంగా సిఎం వైఎస్.జగన్ మోహన్ రెడ్డి నిలుస్తారన్నారు. నవరత్నాల పథకాలతో గడప గడపనా సంతప్తిగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యేకు స్థానిక వార్డు కార్పొరేటర్ నాయకులు ఘన స్వాగతం పలికారు. స్థానిక వార్డు కార్పొరేటర్ షేక్ అలియా, షేకే మెయిన్ బాషా, కార్పొరేటర్ శేఖమద్, స్థానిక వార్డ్ నాయకులు అక్బర్, విజయ లక్ష్మి, అనిల్ బెస్త కార్పొరేషన్, మహేష్ మాజీ కార్పొరేటర్, బాజీద్, షఫీ, గఫూర్, కేదార్‌నాథ్, మహబూబ్, ఆరిఫ్, రెహమాన్, హకీమ్, మద్దిలేటి, గాలెన్న, శివరాజు, రమణ, రాజన్న, అపర్ణ బాయ్, రేణుకభాయ్ సచివాలయం, మున్సిపాలిటీ, రెవెన్యూ, విద్యుత్ సిబ్బంది వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ షేక్ అలియా

బెల్లం తరలిస్తున్న మినీలారీ పట్టివేత

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ తండాలకు కర్ణాటక నుండి అక్రమంగా తరలిస్తున్న 25 సంచుల బెల్లాన్ని, టాటా 407 మినీ లారీని పత్తికొండ సెబ్ అధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సబ్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సమాచారం మేరకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని మినీ లారీని సీజ్ చేసినట్లు చెప్పారు.

ఆవాజ్ కమిటీ ఆర్థిక సాయం

పత్తికొండ : ఇటీవల యాక్సిడెంటులో మరణించిన పంచాయితీ వర్కర్ మహబూబ్ కుమారుడు షేక్షావలి కుటుంబానికి పత్తికొండ ఆవాజ్ కమిటీ తరపున ఆర్థిక సహాయం అందజేశారు. మండల ప్రధాన కార్యదర్శి తాజ్ మహమ్మద్, సహాయ కార్యదర్శి పిల్లికండ్ల బాబా ఫక్రుద్దీన్, సుల్తాన్ అబ్దుల్లా, ముహీద్, నబి రసూల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి

సిఫారసు బదిలీలను నిలిపివేయాలి

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్: గత ప్రభుత్వాలతో పోరాడి సాధించుకున్న ఉపాధ్యాయ కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడిచే సిఫార్సు బదిలీలు వెంటనే నిలిపివేయాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సలాం ఖాన్ ఎస్టీ భవనంలో ఎస్‌టియు జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు బకాయి ఉన్న కరువు భత్యం అరియర్స్‌ను వెంటనే వారి పిఎఫ్ ఖాతాల్లో జమ చేయాలని కోరారు. విరమణ పొందిన వారికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు కూడా మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన ఉద్యమ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులను గెలిపించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టికె జనార్ధన్, ఆర్థిక కార్యదర్శి ఐ రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న రాజు, ప్రధాన కార్యదర్శి సి నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌరు వెంకట్‌రెడ్డి

రియల్ టైం స్ట్రాటాలజీపై శిక్షణ

టిడిపి నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్ : కర్నూలు నగరంలోని దేవి ఫంక్షన్ హాల్‌లో రియల్ టైమ్ స్ట్రాటాలజీ శిక్షణ కార్యక్రమం టిడిపి నాయ కులకు, కార్యకర్తలకు శనివారం నిర్వహించారు. నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టిఎస్ ట్రైనింగ్ నిర్వహించారు. అనంతరం టిడిపి పాణ్యం, నందికొట్కూరు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. నంద్యాల పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర శివానంద రెడ్డి, రాష్ట్ర గొర్రెల పెంపకం చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్‌లు మల్లెల రాజశేఖర్, ఆకెపోగు వెంకటస్వామి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్‌లు పెరుగు పురుషోత్తం రెడ్డి, గుండం రమణరెడ్డి, నంద్యాల పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, మాజీ ఎంపిపిలు మంచాలకట్ట శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, మాదేష్, రాష్ట తెలుగు యువత అధ్యక్షుడు ప్రభాకర్ యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు గంగాదర్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లింగన్న

ప్రజాశక్తి - తుగ్గలి: కూలీలను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.లింగన్న అన్నారు. శనివారం మండల కేంద్రమైన తుగ్గలిలో వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ శ్రీరాములు అధ్యక్షతన జరిగింది. మహాసభలో ఆయన మాట్లాడుతూ మండలం పరిధిలో చాలామంది వ్యవసాయ కూలీలు, కూలి మీదనే జీవనం సాగిస్తున్నారన్నారు. కూలీలకు ఉపాధి పనులు కల్పించకపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. ఇప్పటికే మండలంలో చాలామంది కూలీలు వలసలు వెళ్లారన్నారు. ఉపాధిలో పని దినాలను, కేరళ ప్రభుత్వం మాదిరిగానే ఎపిలో కూడా కూలీలకు ప్రతిరోజు రూ.600 వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వర్షాల ప్రభావం వల్ల పంటల పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులను ఆదుకోవడానికి తుగ్గలి మండలాన్ని కరవు మండలంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల స్పందించి వ్యవసాయ కార్మికులకు తక్షణమే పనులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మండల కమిటీని 11 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షులుగా శ్రీరాములు, కార్యదర్శిగా మారెళ్ళ రంగరాజు, ఉపాధ్యక్షులుగా ఆనంద్, సహాయ కార్యదర్శిగా ప్రభాకర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. వ్యవసాయ కార్మికులు, కూలీలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం : ఎస్ఎఫ్

డిసెంబర్2న ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా మహాసభ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ విద్యను కాషాయీకరణ చేయకుండా మతోన్మాదాన్ని పెంచకుండా ఉండేవిధంగా ఎస్ఎఫ్ఐ నిరంతరం విద్యా సమస్యలపై పోరాడాలని జిల్లా అధ్యక్షులు రంగప్ప విద్యార్థులకు సూచించారు. శనివారం ఎస్ఎఫ్ఐ కర్నూల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సిటీ అధ్యక్షులు అమర్ అధ్యక్షతన జిల్లా మహాసభల కరపత్రం స్థానిక కార్మిక కర్షక భవన్లో విడుదల చేశారు. రంగప్ప,సిటీ కార్యదర్శి సాయి, ఉదయ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడు తున్న ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా 46వ మహా సభలను డిసెంబర్ 2న ఎమ్మిగనూరు పట్ట ణంలో నిర్వహి స్తామన్నారు. ఈ మహాసభల్లో గత రెండేళ్లుగా నిర్వహించిన ఉద్యమాలను సమీ క్షించి భవిష్యత్తు కార్యచరణ రూపొంది స్తామన్నారు. విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభలు జయ ప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిటీ ఉపాధ్యక్షులు అబూబకర్, సిటీ కమిటీ సభ్యులు గోవర్ధన్ , హర్ష నాయకులు తేజ , వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా మహాసభ కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

ఆర్‌టిసి సేవలు మెరుగుపరచాలి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని



బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించి ఆర్‌టిసి సేవలను మరింత మెరుగు పరచాలని అధికారులు ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి సూచించారు. శనివారం ఆదోని ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో ఆదోని కర్నూలుకు కొత్త బస్సు సర్వీసును ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ వెంకట్రామం, డిపో మేనేజర్ రఫీక్ అహ్మద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆర్‌టిసి ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోకి విలీనం చేసి, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. ఆర్‌టిసి బస్సుల్లో మెరుగైన సదుపాయాలతో ప్రయాణికులను ఆకర్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. బస్సుల్లో శుభ్రత ప్రమాణాలు పాటించి, కండిషన్స్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రాకపోకలకు ఆటంకం కలుగకుండా అధికారులు శ్రద్ధ చూపాలని తెలిపారు. ఆరు బస్సులు మంజూరు కాగా త్వరలో హైదరాబాద్‌కు నాలుగు స్లీపర్ మెరుగైన సదుపాయాలతో కూడిన బస్సులు వస్తాయన్నారు. బస్టాండ్‌లో సదుపాయాలు కరువయ్యాయని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రయాణికుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులపై మండిపడ్డారు. ఎస్‌టిఐ రాఘవేంద్ర, కౌన్సిలర్ చలపతి, నాయకులు ఎజాస్, చిన్న ఈరన్న, సలాం ఉన్నారు.

కార్మిక హక్కుల కాలరాసే

4 లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఉద్యమం

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

కార్మిక హక్కుల కాల రాసే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఉద్యమించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు కోరారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో సిఐటియు డివిజన్ కన్వీనర్ రాముడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు, సిఐటియు డివిజన్ కన్వీనర్ రాముడు మాట్లాడారు. కార్మికులు స్వాతంత్ర్యం కంటే ముందు సమరశీల పోరాటాలు చేసి 44 రకాల కార్మిక చట్టాలను సాధించుకున్నారని తెలిపారు. ఈ చట్టాల ద్వారా 8 గంటల పని గంటలు, ఉద్యోగ భద్రత, కనీస వేతనం, సమ్మె హక్కు, సామాజిక భద్రత పెన్షన్, గ్రాట్యుటీ సెలవులు తదితర హక్కులు సాధించుకున్నారని చెప్పారు. బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ఏకపక్షంగా 44 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు మాత్రమే చట్టాలు చేసిందని తెలిపారు. సిఐటియు నాయకులు బి.రాజు, బి.గోవర్ధనమ్మ, బి.శివలక్ష్మి, సురేష్, పి.రాజు, యు.రమేష్, కె.ఆంథోని, జె.నాగరాజు, కె.ఇస్మాయిల్, డి.రవికుమార్, కె.రాజు, గంగన్న, రైతుసంఘం జిల్లా, మండల నాయకులు సి.హనుమంతు, డి.అబ్దుల్లా, ఆశావర్కర్ల యూనియన్ నాయకులు నరసమ్మ పాల్గొన్నారు.

జింకల బెడద లేకుండా చూడండి

- ఫారెస్టు అధికారులకు రైతుల వినతి

ప్రజాశక్తి - ఆస్పరి

జింకల బెడద లేకుండా చూడాలని ఫారెస్టు అధికారులను రైతులు కోరారు. శనివారం జిల్లా కెడిసిసి డైరెక్టర్ రాఘవేంద్ర, సొసైటీ ఛైర్మన్ గోవర్ధన, చంద్రశేఖర్‌లు అధికారులతో మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జింకల బెడద ఎక్కువగా ఉందని, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జింకల పార్కు ఏర్పాటు చేసి జింకల బెడద లేకుండా చూడాలని కోరారు. రైతులు పొలంలో సాగు చేసిన పంటను మొలక దశలోనే జింకలు తిని నాశనం చేస్తున్నాయని తెలిపారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. శనివారం ఫారెస్ట్ అధికారులు ఆస్పరికి వచ్చి రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారని చెప్పారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అనంతరం రైతులు ఫారెస్ట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. రైతులు తిమ్మప్ప, ప్రకాష్, మహానంది, ప్రకాష్ రెడ్డి, శ్రీనివాసులు, రంగన్న, పోతన్న, ఉరుకుంద పాల్గొన్నారు.



ఫారెస్ట్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఎపి అభివృద్ధిపై మోడీకి చిత్తశుద్ధి లేదు

- వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు

ఎపి అభివృద్ధిపై ప్రధాని నరేంద్ర మోడీకి చిత్తశుద్ధి లేదని వామపక్ష నాయకులు విమర్శించారు. శనివారం మోడీ పర్యటనకు వ్యతిరేకంగా ఆలూరు అంబేద్కర్ సర్కిల్‌లో 'ఎపి ద్రోహి నరేంద్ర మోడీ గో బ్యాక్' అంటూ నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు నారాయణస్వామి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు భూపేష్ మాట్లాడారు. ప్రధాని మోడీకి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు, విశాఖ రైల్వే జోన్ ప్రకటించి విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను ఆపేస్తున్నామని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటనను స్వాగతించాలని అధికార పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిలు మాట్లాడడంపై మండిపడ్డారు. సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, సిపిఎం మండల కార్యదర్శి షాకీర్, సిపిఐ టౌన్ సెక్రటరీ మునిస్వామి, ఈరన్న, సిద్ధు, ఎఐఎస్ఎఫ్ మోహన్ నాయక్, ఎస్ఎఫ్ఐ గోవర్ధన్, మైనా పాల్గొన్నారు. **పెద్దకడబూరు** మండలంలో 'మోడీ గో బ్యాక్' అంటూ సిపిఎం ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, పరమేష్, సిపిఎం నాయకులు దేవదాసు, అబ్రహాం బాష పాల్గొన్నారు.



ఆలూరు అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపడుతున్న వామపక్ష నాయకులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి భూపాల్‌రెడ్డి

సత్వర న్యాయమందించడమే లోక్ అదాలత్ ముఖ్యోద్దేశం

- జిల్లా జడ్జి భూపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని: రాజీమార్గంలో కేసులు పరిష్కరించి సత్వర న్యాయమందించడమే మెగా లోక్ అదాలత్ ఉద్దేశమని జిల్లా జడ్జి భూపాల్ రెడ్డి తెలిపారు. శనివారం ఆదోని కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. న్యాయపరమైన సమస్యలకు సత్వర పరిష్కార వేదికగా మెగా లోక్ అదాలత్ దోహదపడుతుందని తెలిపారు. ఉచిత న్యాయ సేవ అందించడమే న్యాయ విజ్ఞాన అధికారిక సంస్థ సభ్యుల లక్ష్యమన్నారు. ఎలాంటి సమస్యకైనా అక్కడ పరిష్కార మార్గం, ఉచిత న్యాయ సేవలు అందుతాయని తెలిపారు. బాధితులు న్యాయ సలహా మండలిని సంప్రదిస్తే అన్ని కేసులకు ఇక్కడ పరిష్కార మార్గం లభిస్తుందని చెప్పారు. న్యాయమూర్తులు శైలజ, హిమబిందు, శ్రీకాంత్, వీవీ.లక్ష్మి, లాయర్‌లు వీరేష్, ఆనంద్, శివకుమార్ స్వామి, తాయన్న పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

- ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ధరణి

ప్రజాశక్తి-ఆలూరు : చిన్నపాటి గొడవలకు కేసులు పెట్టుకొని ఇబ్బందులు పడుతున్న బాధితులు రాజీ మార్గం ఎంచుకొని కోర్టులోని లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ధరణి తెలిపారు. శనివారం కోర్టులో లోక్ అదాలత్ కార్యక్రమంలో 257 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడారు. వివిధ కారణాలతో కేసుల్లో ఉన్న బాధితులు రాజీ మార్గమే రాజా మార్గంగా ఎంచుకొని కుటుంబాలతో, సమాజంలో గౌరవంగా ఉండాలన్నారు. పెండింగ్ కేసుల్లో ఉన్న బాధితులు లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు. న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి ధరణి

వాల్మీకుల్లో చైతన్యం నింపేందుకు

వాల్మీకి కార్తీక వనభోజనం

-కార్తీక వనభోజన సమితి నిర్వాహకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వాల్మీకులను చైతన్య పరిచేందుకు వాల్మీకి కార్తీక వన భోజనాలను ప్రారంభించినట్లు వాల్మీకి కార్తీక వన భోజన సమితి నిర్వాహకులు తెలిపారు. శనివారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్ జోగులాంబ దేవి ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. వాల్మీకి కార్తీక వనభోజన సమ్మేళనం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వాల్మీకి కార్తీక వన భోజన సమితి నిర్వాహకులు విసి.వెంకటేష్, బిఆర్‌కె.రామకృష్ణ, కృష్ణమూర్తి, రాఘవన్, విసిఆర్.కొండయ్య, మల్లయ్య, వాల్మీకి శంకరయ్య, గోనెగండ్ల వాల్మీకి రంగస్వామి, హుస్సేని, ముని, పుండుకూర రంగన్న, హాలహర్వి యాపిలయ్య మాట్లాడారు. ఈ నెల 20న ఆదివారం పట్టణంలోని వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో గల గ్లోబల్ ఇండస్ స్కూల్‌లో వాల్మీకి వనభోజన సమితి ఆధ్వర్యంలో కార్తీక వనభోజన సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లక్ష్మయ్య, తిమ్మా రెడ్డి, బీటీ.లక్ష్మన్న, రాజ్ కుమార్ నాయుడు, యల్లం బీడు లక్ష్మన్న, టీచర్ నరసింహులు, నారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు



గ్రామసభలో మాట్లాడుతున్న నాయకులు

సచివాలయంలో గ్రామసభ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని కల్లుకుంట గ్రామ సచివాలయంలో సర్పంచి ఇస్మాయిల్ ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి నేతలు రవిచంద్ర రెడ్డి, జాము మూకయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. వలసల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, కూలీలకు ఉపాధి పనులపై అవగాహన కల్పించాలని కోరారు. సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సభ్యులుగా ఈరన్న

ప్రజాశక్తి - పెద్దకడబూరు

భవన నిర్మాణ సంఘం (సిఐటియు) రాష్ట్ర కమిటీ సభ్యులుగా పెద్దకడబూరుకు చెందిన ఉప్పర ఈరన్న ఎన్నికయ్యారు. గుడివాడలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఈరన్నను ఎన్నుకున్నారు. మండలంలో భవన కార్మిక సంఘం నాయకులుగా, సిఐటియు మండల కార్యదర్శిగా కార్మికుల హక్కుల కోసం ఈరన్న పోరాటాలను గుర్తించి ఎన్నుకున్నారు. కార్మికుల సమస్యలపై పోరాటాలు చేస్తూ కార్మికుల పక్షాన నిలుస్తానని శనివారం ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ శివారులో బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న గుజిరిలో శనివారం విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందారు. ఈ ప్రమాదంలో పట్టణంలోని దండుగేరి హనుమంతు అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గుజిరిలో ఇనుప కడ్డీలు లారీకి లోడ్ చేస్తుండగా విద్యుత్ తీగలు తాకి విద్యుదాఘాతం చోటు చేసుకుంది. ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఆదోని త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ను ప్రకటించాలి

- సిఫార్సు ఉపాధ్యాయ బదిలీలను రద్దు చేయాలి

- డిటిఎఫ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ను ప్రకటించాలని, సిఫార్సు బదిలీలు, అక్రమ ఉపాధ్యాయ బదిలీలను రద్దు చేయాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కరె కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి గోట్ల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం డిటిఎఫ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ అక్రమంగా 207 ఉపాధ్యాయుల సిఫార్సు బదిలీలను జారీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ అక్రమ బదిలీలను రద్దు చేసి గత ఆరు మాసాలుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ను ప్రకటించి రేషనలైజేషన్, పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. డిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడు, రామన్న, డిటిఎఫ్ మండల బాధ్యులు పాటిల్ ఈశ్వర్ రెడ్డి, శివశంకర్, వెంకటేశప్ప, రవీంద్ర పాల్గొన్నారు.

ప్రజల వద్ద నటిస్తే ఎవరూ నమ్మరు

- చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకే పవన్ ఆరాటం

- పవన్ కల్యాణ్ ఎప్పటికీ ముఖ్యమంత్రి కాలేడు

- వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

పవన్ కల్యాణ్ సినిమాల్లో నటించినట్లు ప్రజల వద్ద నటిస్తే ఎవరూ నమ్మరని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని వగరూరు గ్రామంలో మూడో రోజు 'గడపగడపకు మన ప్రభుత్వం' చేపట్టారు. వైసిపి యువనేత వై.ప్రదీప్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని జగనన్న కాలనీల్లో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసేందుకే పవన్ కల్యాణ్ ఆరాటం తప్ప సొంత పార్టీని కాపాడుకోవడానికి కాదని తెలిపారు. ఇలాంటి పవన్ కల్యాణ్ ఎప్పటికీ ముఖ్యమంత్రి కాలేడని జోస్యం చెప్పారు. నిజంగా చంద్రబాబు నాయుడుకు ధైర్యం ఉంటే పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రి చేస్తామని చెప్పాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. నియోజకవర్గంలో దాదాపు 5 వేల ఇళ్లు మంజూరు కాగా 50 శాతానికి పైగా జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. మరో 25 శాతం లబ్ధిదారుల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్నారని పేర్కొన్నారు. ఎస్ఐ వేణుగోపాల్ రాజ్, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు విశ్వనాథ్ రెడ్డి, మండల నాయకులు బూదూరు లక్ష్మి నారాయణ రెడ్డి, కాంతారెడ్డి, రాఘవరెడ్డి, మధుసూదన్ రెడ్డి, వీరారెడ్డి, సర్పంచి లింగా రెడ్డి, ఎంపిటిసి చిన్నన్న పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- వడ్డెర సేవా సంఘం కార్తీక వనభోజన మహోత్సవం

ప్రజాశక్తి - హోళగుంద

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని నాయకుడు కోరారు. శనివారం హోళగుందలోని శ్రీసిద్దేశ్వర దేవాలయం ప్రాంగణంలో వడ్డెర సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ నుంచి సిద్దేశ్వర దేవాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ముఖ్య అతిథులుగా వడ్డెరల సాధికార సమితి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకట్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ రామసుబ్బయ్య, వడ్డెర జిల్లా ఉపాధ్యక్షులు ఓర్సు శ్రీనివాసులు, బీసీ సహకార సమితి రాష్ట్ర అధ్యక్షులు రమణ, దేవనకొండ జడ్‌పిటిసి రామకృష్ణ, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పెద్దన్నలు హాజరయి మాట్లాడారు. వడ్డెరలు ఐకమత్యంతో పోరాడాలని తెలిపారు. వడ్డెర జిల్లా కార్యదర్శు ఎల్ఐసి రామకృష్ణ, మండల అధ్యక్షులు ఎర్రిస్వామి, ఉపాధ్యక్షులు మారెన్న, కార్యదర్శి విశ్వనాథ్ రాజు, కోశాధికారి రవి పాల్గొన్నారు.

కనకదాసు విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

- కురువ సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

పట్టణంలో భక్త కనకదాసు విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలని కురువ సంఘం నాయకులు కెటి.ఉరుకుంద, హంపయ్య, మద్దిలేటి, వీరనాగప్ప, వెంకటాపురం సత్యన్న, అంజనయ్య, వెంకప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని బీరలింగేశ్వర స్వామి కల్యాణ మండపంలో కనకదాసు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలోని కర్నూలు, ఆదోనిలో కనకదాసు విగ్రహ ప్రతిష్టాపనకు ప్రభుత్వం స్థలం కేటాయించిందని, కురువలు ఎక్కువగా ఉన్న ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మాత్రం స్థలం ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరహరి శాస్త్రి కురువలకు కనకదాసు చిత్రపటాలను అందజేశారు. బోడబండ కడివేళ్ల హనుమంతు, రవికుమార్, విష్ణప్ప పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేద్దాం

- ఈనెల 16న ఆదోనిలో బాబు బస

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

కర్నూలు జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఖరారు అయిందని, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు కోరారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ఈనెల 16న హైదరాబాదు నుంచి ప్రత్యేక విమానంలో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి రోడ్డు గుండా వాహనంలో పత్తికొండకు చేరుకుంటారని చెప్పారు. అక్కడ టిడిపి ఇన్‌ఛార్జీ శ్యాంబాబు అధ్యక్షతన జరిగే 'బాదుడే... బాదుడు..'లో పాల్గొంటారన్నారు. రాత్రి ఆస్పరి మీదుగా ఆదోనిలోని చేకూరి ఫంక్షన్ హాలులో బస చేస్తారని తెలిపారు. 17న ఎమ్మిగనూరులోని జయ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే 'బాదుడే... బాదుడు...'లో పాల్గొంటారని చెప్పారు. 18న కర్నూలులోని టిడిపి కార్యాలయం ప్రారంభోత్సవం, ఎన్‌టి.రామారావు విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు. అనంతరం మౌర్య ఇన్ హోటల్‌లో 7 నియోజకవర్గాల నాయకులతో ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్తాఫ్ హుస్సేన్, టిడిపి జిల్లా కార్యదర్శి బుద్ధారెడ్డి, బీసీ సెల్ ప్రచార అధికార ప్రతినిధి తిమ్మప్ప, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు వెంకటేష్, జయరాం, ఆరిఫ్, మాబాష, రాజు, సుబ్బు, వీరేష్, మహ్మద్, రంగస్వామి నాయుడు, తెలుగు యువత అధ్యక్షులు రవి, ఇక్బాల్, చాగి మల్లికార్జున రెడ్డి ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న మీనాక్షి నాయుడు

రూ.1.08 కోట్లతో వార్డు అభివృద్ధి

- 18వ వార్డు కౌన్సిలర్ చలపతి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని 18వ వార్డు ఇంద్ర నగర్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామని ఆ వార్డు కౌన్సిలర్ చలపతి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సదుపాయాల కోసం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద రూ.1.08 కోట్లతో అభివృద్ధి పనులు చేయించామన్నారు. టీచర్స్ కాలనీ, లక్ష్మమ్మ నగర్ ప్రాంతాల్లో రూ.50 లక్షలతో బీటీ రోడ్లు నిర్మాణం వేయించామని తెలిపారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధుల నుంచి ఇంద్ర నగర్‌లోని లక్ష్మమ్మ కాలనీ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో బీటీ రోడ్డుకు రూ.10 లక్షలకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. 17వ వార్డు పరిధిలో ఉన్న ఇంద్రనగర్ ప్రాంతంలో డ్రెయినేజీ నిర్మాణం కోసం రూ.10 లక్షలు ప్రతిపాదించామని తెలిపారు. ఎరుకుల కాలనీ, ఇంద్రనగర్ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో పనులు చేసేందుకు మరో రూ.60 లక్షలకు కౌన్సిల్ ఆమోదం చేయించామని చెప్పారు. ఉప్పర కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కారం కోసం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేయించామన్నారు. కొత్తగా 15 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించామని తెలిపారు. 1975లో అమర్చిన విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటి స్థానంలో మరో 20 విద్యుత్ స్తంభాల కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. కాలనీలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేకపోవడంతో కొందరు ముళ్ల పొదల్లోకి బహిర్భూమికి వెళ్తున్నారన్నారు. వారి కోసం రెండు పబ్లిక్ టాయిలెట్లు కావాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఇంద్ర నగర్‌లో సుమారు 10 వేల జనాభా ఉందని, వారందరికీ తాగునీటి సదుపాయం, వీధిలైట్లు ఇతర సదుపాయాల కల్పనకు నిరంతరంగా పాటుపడతామని చెప్పారు. వార్డులో మొక్కలు పెంపకం, పరిసరాల పరిశుభ్రత ఉండేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, యువ నాయకులు మనోజ్ రెడ్డి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామని వివరించారు.



సమస్యలు తెలుసుకుంటున్న కౌన్సిలర్ చలపతి



జర్నలిస్టు మండల కమిటీ సభ్యులు

ఐకమత్యంగా ఉండాలి

ప్రజాశక్తి - హోళగుంద

జర్నలిస్టులందరూ ఐకమత్యంగా ఉండి ప్రస్తుత పరిస్థితుల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఛాలెంజ్‌గా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎల్ఎల్‌సి గెస్ట్ హౌస్‌లో జిల్లా నాయకులు సుంకన్న, స్వరూప్, చంద్రమోహన్ ఆధ్వర్యంలో జర్నలిస్టు మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా బిఎం.అమీర్ సాబ్ (విశాలాంధ్ర), అధ్యక్షులుగా సిహెచ్.నాగరాజ్ (ప్రజాశక్తి), కార్యదర్శిగా రవికాంత్ (ఆంధ్రప్రభ), కోశాధికారిగా మహేష్ గౌడ్ (ఆంధ్ర అక్షర), సమన్వయ కార్యదర్శిగా ఈడిగ నాగరాజు గౌడ్ (ఆంధ్రజ్యోతి), ఉపాధ్యక్షులుగా విరుపాక్షి (వార్త), నాగప్ప (సాక్షి), సహాయ కార్యదర్శులుగా మహబూబ్ బాషా (ఆంధ్రప్రభ రూరల్), మధుసూదన్ (వార్త), కార్యవర్గ సభ్యులుగా మంజునాథ్ (మనం), విశ్వనాథ్ (ఆంధ్ర పత్రిక) కాకి వీరేష్ (ప్రభ), సాయి బేస్ (9 టివి), గౌరవ సలహాదారులుగా మంజునాథ్ (మన తెలుగు టివి)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ శ్యాం ప్రసాద్

రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న మోడీ

- పిఎం గో బ్యాక్ అంటూ సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన



నంద్యాల గాంధీ చౌక్ సెంటర్‌లో పిఎం మోడీ గో బ్యాక్ అంటూ నిరసన చేపడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలను ప్రధాని నరేంద్ర మోడీ నెరవేర్చకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం, జిల్లా ఉపాధ్యక్షులు తోటమద్దులు విమర్శించారు. రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న పిఎం మోడీ గో బ్యాక్ అంటూ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం స్థానిక గాంధీచౌక్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభజన సందర్భంలో రాష్ట్రానికి ప్రత్యేక హెూదా 15 సంవత్సరాలు అధికారంలోకి వస్తే ఇస్తామని, వెనకబడిన రాయలసీమ ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి అభివృద్ధి చేస్తామని, కడపలో స్టీల్ ప్లాంట్, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని చెప్పి 9 సంవత్సరాలు కావస్తున్న ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా రాష్ట్రంలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రానికి పిఎం మోడీ వచ్చిన ప్రతిసారీ ఏదో ఒకటి అంబానీ, ఆదానీలకు అమ్మివేయాలని చూడడం సరైనది కాదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని పిఎం వెంటనే చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కె.మహమ్మద్ గౌస్,కోశాధికారి వెంకట్ లింగం, నాయకులు జైలాన్, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

ఆత్మకూరు : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయరాదని, రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలను నెరవేర్చాలని సిపిఎం సీనియర్ నాయకులు ఏ.రాజశేఖర్, పట్టణ కార్యదర్శి రణధీర్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆత్మకూరులోని కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న బిజెపి ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గో బ్యాక్ అంటూ నిరసన తెలియజేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, సిపిఎం నాయకులు స్వాములు, ఇస్మాయిల్, సురేంద్ర, గణపతి, శీలర్, శివ, నాగేంద్రబాబు, సంజీవ రాయుడు, హమాలీలు రైట్ భాష, ఆటో కార్మికులు హుషాన్ షా, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరులో రాస్తారోకో

నందికొట్కూరు : రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రధాని నరేంద్ర మోడీ ఘోరంగా విఫలమయ్యారని, రాష్ట్రంలో పర్యటించడం సిగ్గుచేటని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు విమర్శించారు. రాష్ట్రంలో మోడీ పర్యటించడాన్ని నిరసిస్తూ శనివారం సిపిఎం ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుండి పటేల్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా నాయకులు పి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సిపిఎం నాయకులు బెస్తరాజు, ఆంజనేయులు, ఈశ్వరమ్మ, లింగస్వామి, కర్ణ, రామ సుబ్బయ్య, వేణుగోపాల్, లక్ష్మన్న ఆటో యూనియన్ నాగన్న, మధుబాబు, శేఖర్, వెంకటేశ్వర్లు, మహిళా సంఘం నూర్జాన్, సోడా బిబి, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు. **పగిడ్యాల :** ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోడి ప్రభుత్వాన్ని గద్దె దించాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు రంగమ్మ, జిల్లా నాయకురాలు ఉశేనమ్మ పేర్కొన్నారు. పగిడ్యాలలో డప్పు, కాటి కాపర్లతో సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాయకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, మూగెన్న, దేవదాసు, లక్ష్మిదేవి, రమణయ్య, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న సిపిఎం, సిఐటియు నాయకులు



నందికొట్కూరులో నల్ల జెండాలతో నిరసన ర్యాలీ చేపడుతున్న సిపిఎం నాయకులు

వైద్య విజ్ఞానం నిరంతరం పెంచుకోవాలి

- వైద్య విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ శ్యాం ప్రసాద్
- రాష్ట్ర స్థాయి వైద్య వైజ్ఞానిక సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల

వైద్య రంగంలో నిరంతరం మార్పులు వస్తుంటాయని, అందుకు అనుగుణంగా వైద్యులు తమ పరిజ్ఞానాన్ని నిత్యం పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎపి రాష్ట్ర డాక్టర్ వైయస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డాక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. ఎపి రాష్ట్ర ఐఎంఎ 7వ రాష్ట్ర వైద్య వైజ్ఞానిక సదస్సు శనివారం నంద్యాలలోని సౌజన్య ఫంక్షన్ హాల్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డాక్టర్ శ్యాం ప్రసాద్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సదస్సులో 27 మంది వివిధ వైద్య నిపుణులు వివిధ అంశాలపై ప్రసంగిస్తున్నారని, ఇంత చక్కటి సదస్సు నంద్యాల ఐఎంఎ నిర్వహించడం ప్రశంసనీయం అన్నారు. కార్యక్రమంలో ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస రాజు, ఈ సంవత్సరానికి అధ్యక్షుడుగా ఎన్నికైన నంద్యాలకు చెందిన డాక్టర్ రవికృష్ణ, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ కార్య వర్గ సభ్యులు డాక్టర్ ప్రసాద రెడ్డి, శాంతి రామ్ మెడికల్ కాలేజ్ వైస్ చైర్మన్ డాక్టర్ మాధవీ, సదస్సు నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ అనిల్ కుమార్, వైజ్ఞానిక కమిటీ చైర్మన్ డాక్టర్ మధుసూదన్ రావు, కార్యదర్శి డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి, కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్, కోశాధికారి డాక్టర్ అనిల్ కుమార్, నంద్యాల శాఖ అధ్యక్షులు డాక్టర్ జఫ్రుల్లా, మహిళా విభాగం నాయకులు డాక్టర్ నర్మద, డాక్టర్ నాగమణి, డాక్టర్ వసుధ, డాక్టర్ లక్ష్మీ సౌజన్య, అధిక సంఖ్యలో ప్రతినిధులు వివిధ జిల్లాల నుండి పాల్గొన్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి - శ్రీశైలం



శ్రీశైలం క్షేత్రానికి అధిక సంఖ్యలో చేరుకున్న భక్తులు

కార్తీక మాసం పురస్కరించుకొని శ్రీశైలం క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. కార్తీక శోభాయమానంగా శ్రీశైలం క్షేత్రం విలసిల్లుతోంది. తెలుగు రాష్ట్రాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో శ్రీశైలంకు చేరుకున్నారు. తెల్లవారుజాము నుండి స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లో నిల్చున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి సుప్రభాత సేవ, మహా మంగళహారతి కార్యక్రమాల అనంతరం నాలుగు గంటల నుండి భక్తులకు దర్శనానికి అనుమతి ఇచ్చారు. సాయంత్రం నాలుగున్నర గంటల నుండి రాత్రి 11 గంటల వరకు దర్శనం ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్నందున ఆర్జిత అభిషేకాలు, గర్భాలయ అభిషేకాలు రద్దు చేశారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రధాన కూడలిలో వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పరి పాలన భవనంలో పనిచేసే సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు.

డోన్ పట్టణ అభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్



సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

డోన్ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. శనివారం పట్టణంలోని భారత్ గ్యాస్ ఆఫీస్ ఎదురుగా వెంకటనాయుని పల్లె రోడ్డు పనులను, రూ.15 లక్షలతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు పనులను చైర్మన్ రాజేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సహకారంతో డోన్ మున్సిపాలిటీలో ఎన్నడూ లేని అభివృద్ధిని చేస్తున్నట్లు తెలిపారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు సెంట్రల్ లైటింగ్‌తో డబల్ లైన్ రోడ్డు ఏర్పాటు చేశామన్నారు. సెంట్రల్ లైటింగ్ పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు పార్కులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వార్డులలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటు న్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కొట్రికె హరికిషన్, ఎస్ఎండి.జాకీర్ హుస్సేన్, వైసిపి నాయకులు పోస్టు ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ డిటి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి ఆయకట్టుకు నీరు లేదు..!

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రైతుల ప్రభుత్వం అని గొప్పలు చెబుతున్నా ప్రభుత్వంలో రైతులు పండించిన పంట కళ్లెదుటే వాడుతున్నా నీరందివ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వం, అధికారులు వైఫల్యం చెందారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హంద్రీనీవా కింద ఈ ఖరీఫ్‌లో వేసిన పంటలు చేతికొచ్చే సమయానికి నీరు అందక 65 శాతం పంట నష్టం వాటిల్లింది. ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మంత్రులున్నా రైతులకు ఒరిగిందేమి లేదని అన్నదాత ఆక్రోశం చెందుతున్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు నివేదిక ప్రకారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80 వేల ఎకరాల ఆయకట్టుకు ఖరీఫ్ సీజన్‌లో హంద్రీనీవా ద్వారా ఏడు టిఎంసిల నీటి వాడకం కోసం, ఒక టిఎంసిని కర్నూలు తాగునీటి అవసరాలకు తీసుకుంటుంది. 18 సంవత్సరాలు పూర్తి అయినా హంద్రీ ఆయకట్టులో ఇప్పటికి కేవలం 31 వేల ఎకరాలకు మాత్రమే నీటిని అందిస్తున్నారు. నీటిని అందించాలని రైతులు కోరుతున్నా కాంట్రాక్టర్లు సహకరించలేదని, తగినంత నీటి లభ్యత లేదని, ప్రభుత్వం అనుమతులు లేవని, పిల్లకాలువలు లేవని మాయమాటలు చెప్తూ జిల్లా రైతాంగానికి తీరని అన్యాయం చేస్తున్నారని రైతాంగం ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో ఆర్థిక మంత్రి, కార్మిక శాఖ మంత్రి ఉన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ఆర్థిక మంత్రి వ్యవహరిస్తున్నా హంద్రీనీవా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదని పంట చేతికి వచ్చే సరైన సమయంలో హంద్రీనీవాకు నీటిని నిలిపివేసిన దుస్థితి జిల్లాలో ఏర్పడింది. తద్వారా పత్తి, మొక్కజొన్న, ఉల్లి, టమోటా, తదితర పంటలన్నీ వాడిపోయాయి.

టమోటా రైతు విలవిల : టమోటా ధర రోజురోజుకూ పడిపోతుండడంతో సాగు చేసిన రైతులు గగ్గోలు పెడుతున్నారు. నెల రోజుల క్రితం ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా ధర పడిపోవడంతో రైతులు దిగులు పడుతున్నారు. గతంలో బాక్సు (25 కిలోలు) ధర రూ.500 పలికింది. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.100లోపే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కోత కూలిలు, రవాణ ఖర్చులు, కమీషన్ పోను రైతుకు ఏమాత్రం మిగలకపోవడంతో నష్టపోతున్నారు. అక్టోబర్‌లో కురిసిన వర్షాలకు టమోటా పంట పూర్తిగా దెబ్బతినడంతో దిగుబడులు భారీగా తగ్గాయి. ఆ సమయంలో ధరలు పెరిగాయి. ప్రస్తుతం కొన్ని రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండడంతో దిగుబడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం బాక్స్ ధర రూ.300లోపే పలుకుతుండటంతో కనీసం రవాణా ఛార్జీలు కూడా రావడం లేదు.

అవీ..ఇవీ..అన్నీ...

అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ 1వ మహాసభ నిర్వహించారు. జిల్లాల్లో పిడిఎఫ్ అభ్యర్థులు బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థుల తరపున ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రజల గొంతుక వినిపించే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని కోరుతున్నారు. ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్ జిల్లాలో పర్యటించారు. తుగ్గలిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఐఎంఎ ఆధ్వర్యంలో రాష్ట స్థాయి వైద్యుల క్రీడా పోటీలు నంద్యాలలో నిర్వహించారు. శ్రీశైలం లక్ష దీపోత్సవం చేపట్టారు.





స్కిల్ హబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి

ఉద్యోగ అవకాశాల కల్పనకు స్కిల్ హబ్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి తెలిపారు. శనివారం నంద్యాలలోని బొమ్మల సత్రంలో ఉన్న పిఎసి, కెవిఎస్‌సి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే స్కిల్ హబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు సరైన మార్గనిర్దేశం చేసేందుకు ప్రభుత్వం ఎపి రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థను ప్రారంభించిందని చెప్పారు. స్కిల్ హబ్స్ కేంద్రాలలో నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శశికళ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగ్గిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్ శేగిరెడ్డి అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బాల అకాడమీ'లో ఘనంగా నేషనల్ బర్డ్స్ డే

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో శనివారం నేషనల్ బర్డ్స్ డేను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలతలు సలీమ్ మెయిజుద్దీన్ అబ్దుల్ అలీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈయన ప్రఖ్యాత పక్షి శాస్త్రవేత్త, పద్మ విభూషణుడు, రాజ్యసభ సభ్యుడని, బర్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా అని కూడా పిలవబడ్డారని వారు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ హరిచందన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మాధవీలత

మధ్యాహ్న భోజన కార్మికులకు

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల

ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు, స్కావెంజర్లకు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, జిల్లా నాయకులు కేఎండి గౌస్, బాల వెంకట్‌లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్, స్కూల్లో చెత్త ఊడ్చే స్కావెంజర్ల విస్తృత స్థాయి సమావేశం ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజన కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలు పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటుపరం చేయడాన్ని వెంటనే ఆపాలన్నారు. కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కూల్ స్కావెంజర్స్‌కు కూడా కనీస వేతనం రూ.16 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అధికారుల వేధింపులు ఆపాలన్నారు. సమావేశంలో సుందరమ్మ, మేరమ్మ, కృపమ్మ సమాధానంమ్మ, లక్ష్మీ, హుస్సేన్ బి, ప్రభావతి, కార్మికులు, స్కావెంజర్లు పాల్గొన్నారు.



లా సెట్ కౌన్సిలింగ్ తేదీ విడుదల చేయాలి

- ఎస్‌సి, ఎస్‌టి, బిసి యువజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

లాసెట్ విద్యార్థులకు కౌన్సెలింగ్ తేదీలను వెంటనే విడుదల చేయాలని ఎస్‌సి, ఎస్‌టి, బిసి యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ రియాజ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022-2023 విద్యా సంవత్సరం గడువు ముగుస్తున్నా ఇంత వరకు లా సెట్ కౌన్సిలింగ్ తేదీలను విడుదల చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల మందికి పైగా విద్యార్థులు న్యాయ విద్యను అభ్యసించాలని లా సెట్ పరీక్షలు రాసి, ఉత్తీర్ణులై కౌన్సిలింగ్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, వెంటనే లా సెట్ కౌన్సిలింగ్ తేదీలను ప్రకటించాలని, లేనిపక్షంలో ఉన్నత విద్యాశాఖ మండలి కార్యాలయాన్ని లా సెట్ విద్యార్థులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దివాకర్, నాగేంద్ర, సోము, బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ రియాజ్

క్షతగాత్రుడికి బిసి ఇందిరా పరామర్శ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలం కోరుమానుపల్లె గ్రామానికి చెందిన సూర్యనారాయణ కొద్దిరోజుల క్రితం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి గాయపడడంతో శనివారం మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అంబటి జయలక్ష్మి రెడ్డి, ఎం.శివరామిరెడ్డి, నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండం ఆంజనేయస్వామి ఆలయంలో బిసి ఇందిరా పూజలు

మండలంలోని కోరుమానుపల్లె గ్రామంలో బలిజ సంఘం వారి ఆహ్వానం పిలుపు మేరకు కార్తీకమాసం సందర్భంగా గుండం ఆంజనేయస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి శివరామిరెడ్డి, టిడిపి మండల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.




ఆలయంలో హారితిని తీసుకుంటున్న బిసి ఇందిరా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామి రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని పాతపాడు గ్రామ సచివాలయం పరిధిలోని సాధుకొట్టం, మదాసుపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు జగనన్న సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందాలంటే మళ్ళీ జగనన్న ముఖ్యమంత్రి కావాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైసిపిని అఖండ మెజార్టీ తో గెలిపించాలని కోరారు. వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రాం మోహన్ రెడ్డి, యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చి రెడ్డి, బనగానపల్లె మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సన్నల జనార్ధన్ రెడ్డి, ఎంపీటీసీ బెడదల రామేశ్వర రెడ్డి, వైసిపి నాయకులు గడ్డం వెంకటేశ్వర రెడ్డి, బెడదల చంద్ర శేఖర్ రెడ్డి, బెడదల శివ శంకర్ రెడ్డి, బెడదల సత్యం రెడ్డి, మూల రంగస్వామి, కుమ్మరి మహేష్, సంగు రామసుబ్బారెడ్డి, బెడదల నారాయణ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, బండి బ్రంహనంద రెడ్డి, ఈశ్వర్ నాయక్, జోలాపురం తిరుపాల్, సాధు కొట్టం గోపాల్ రెడ్డి, స్వామిరెడ్డి, నారాయణ, కొట్టం మద్దిలేటి, వెంకట నరసింహుడు, వెంకట రాముడు, మాదాసు పల్లె పెద్ద సుబ్బరాయుడు, చిన్న సుబ్బరాయుడు, రామ సుబ్బయ్య, సుబ్బారెడ్డి, రామదాసు, వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ శివ రామయ్య, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **సంజామల :** మండలంలోని ఎగ్గోని, ముచ్చలపురి, కొత్తపేట గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలో ఓ మహిళకు వితంతు పింఛను రాలేదని తెలుసుకొని వాలంటీర్‌ను, సంబంధిత అధికారులను వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎంపిడిఒ విజయ్ కుమార్ రెడ్డి, గ్రామ సర్పంచి మళ్ళీ హుస్సేన్, ఆకుమల్ల సర్పంచి వెంకటయ్య, వైసిపి నాయకుడు నాగేశ్వర్ రెడ్డి వెంకట్రాంరెడ్డి, ముదిగేడు శేఖర్ రెడ్డి, ముక్కమల్ల వెంకటరామిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చిన్నబాబు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **రుద్రవరం :** మండలంలోని ముకుందాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వైసిపి సీనియర్ నాయకులు గంధం రాఘవరెడ్డి, పెద్ద కమ్ములు నర్సిరెడ్డి, నర్సాపురం మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, రుద్రవరం సొసైటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, నాగముని, సర్పంచ్ ,తాసిల్దార్ వెంకట శివ, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, హౌసింగ్ ఎఇ మూర్తి పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** పట్టణంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి, నంద్యాల విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్ రెడ్డితో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు రమేష్ గౌడ్, నాయకులు ఆజాద్, నజీర్, సునీల్, రామ్మోహన్ రెడ్డి, శానిటేషన్ అధికారి బాలస్వామి, సచివాలయ అడ్మిన్ గంగాభవాని, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్ర రెడ్డి

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్

ప్రజాశక్తి - కొత్తపల్లి

రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయ్యిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని సప్త నదుల సంగమ తీరంలో వెలసిన సంగమేశ్వర క్షేత్రంలో జిల్లా కమిటీ నాయకత్వన రైతు కుటుంబాల కలయిక వనభోజన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 8 మండలాల నుంచి రైతు కుటుంబాలతో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏ.రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులకు పాలకులు తమ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని రైతులను అన్ని విధాల ఆదుకుంటామని గొప్ప ప్రకటనలు చేస్తున్నారు కానీ.. క్షేత్ర స్థాయిలో రైతులను ఆదుకోవడంలో లేదన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అతివృష్టి, అనావృష్టితో, కల్తీ విత్తనాలు, అనేక రకాల తెగుళ్లతో రైతులు పంటలు బాగా నష్టపోయారు అన్నారు. పత్తి, మిర్చికి ఎకరాకు 50,000 నుంచి 70 వేల రూపాయలు పెట్టుబడి పెడితే పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉందన్నారు. దీంతో రైతులకు కొత్త అప్పులు కూడా తోడేయ్యాయని అన్నారు. గిట్టుబాటు ధరలు, ప్రభుత్వ కొనుగోలు కేంద్ర లేక ప్రైవేట్ వ్యాపారస్తులు దోచుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశాలు కల్పించాయన్నారు. నష్టపోయిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని, పంటల బీమా, వర్తింపచేయాలని కల్తీ విత్తనాలు అందించిన కంపెనీలపై తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహయ కార్యదర్శులు టి. రామచంద్రుడు, టి. వెంకటేశ్వరరావు, వి. సుబ్బరాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్, రైతు సంఘం జిల్లా నాయకులు సంజీవరాయుడు, బి. రమణమ్మ, డి .దాసు ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు స్వాములు, రమణమ్మ, పుల్లమ్మ, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్



బుడ్డా రాజశేఖర రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న జాబిఉల్లా, అశోక్

'మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి సాయం మరువలేనిది'

ప్రజాశక్తి - వెలుగోడు

మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి రుణం తీర్చుకోలేనిదని వెలుగోడు మండలనికి చెందిన జాబిఉల్లా, అశోక్ అన్నారు. శనివారం వారు మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్వగృహంలో ఆయనను కలిశారు. ఈ సందర్బంగా జాబిఉల్లా, అశోక్ మాట్లాడుతూ ఎస్‌బిఐ లైఫ్ ఇన్సురెన్సులో ఉద్యోగం కల్పించిన బుడ్డా రాజన్న రుణం తీర్చుకోలేనిదని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ అవకాశాలను అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలన్నారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువత ఆత్మకూర్ పట్టణంలోని ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు, నిరుద్యోగ యువతను జాబ్ లేకుండా ఇబ్బంది పెడుతున్న ప్రస్తుత ప్రభుత్వాన్ని రానున్న రోజుల్లో యువత ఓటు అనే ఆయుధంతో బుద్ధిచెప్పాలని అన్నారు.

మద్దిలేటి స్వామి ఆలయానికి రూ.7.09 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలసిన శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి దర్శనం టికెట్లు, లడ్డు, ప్రసాదం షాపుల బాడిగలు విరాళాలు తదితర వాటి ద్వారా రూ.7,09,900 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవో పాండురంగారెడ్డి శనివారం తెలిపారు. కార్తీక మాసం పురస్కరించుకొని స్వామివారి ఆలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు.

మంచి నీటి పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి - పగిద్యాల

పగిద్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని మంచి నీటి పైపులైన్ పగిలి నీరు వృధాగా పోతుండడంతో సర్పంచు పెరుమాళ్ళ శేషన్న శనివారం మరమ్మతులు చేయించారు. ఆదేవిధంగా విద్యుత్ ట్రాన్స్‌ఫర్మ్ వద్ద చుట్టూ కంపచెట్లను తొలిగించారు.



పైపులైన్ మరమ్మతులు చేయిస్తున్న సర్పంచు శేషన్న

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



ఆత్మకూరులో లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి



రుద్రవరంలో లోక్ అదాలత్‌లో పాల్గొన్న కక్షిదారులు, తదితరులు



కోవెలకుంట్లలో కేసులను విచారిస్తున్న జడ్జి

లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలోని కోర్టు ఆవరణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 158 కేసులు పరిష్కారం అయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి రఘునాథ్ ఆధ్వర్యంలో కేసులు పరిష్కరించబడ్డాయి. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరిరాజు, బ్యాంకుల అధికారులు, సీనియర్ న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

రుద్రవరం : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది పి.సుబ్బయ్య అన్నారు. నియోజవర్గం లోని రుద్రవరం మండల కేంద్రంలో శనివారం ఐదవ అదనపు జిల్లా జడ్జి వాసు ఆదేశాల మేరకు ఇంటింటికి న్యాయ అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. రుద్రవరంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టాల గురించి పూర్తిగా అవగాహన లేక చాలామంది ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు కొల్లం పుల్లయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మీదేవి తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

కోవెలకుంట్లలో 286 కేసులు పరిష్కారం

కోవెలకుంట్ల : కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలతో 223 కేసులు పరిష్కారమయినట్లు కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ రెహిమాన్ తెలిపారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించిన 286 కేసుల్లో క్రిమినల్ కేసులు 272, సివిల్ కేసులు 14 పరిష్కరించామన్నారు. పలు కేసుల్లో సంబంధించిన కక్షిదారులకు కోర్టు ద్వారా రూ. లక్షల 12,15,192 అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, బార్ ప్రెసిడెంట్ మల్లికార్జునరెడ్డి, సెక్రెటరీ శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాదులు కృష్ణమూర్తి, నరసింహులు, బాల మురళి, నాగశేషు, చంద్రుడు, తిరుపేలు, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.



ధోని సన్మానిస్తున్న మంత్రి బుగ్గన

క్రికెటర్ ధోనితో మంత్రి బుగ్గన

ప్రజాశక్తి - బేతంచర్ల

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చెన్నైలో శనివారం కలిశారు. ఇండియా సిమెంట్స్ 75వ వార్షికోత్సవ ఉత్సవాలు చెన్నైలో జరుగుతున్న సందర్భంగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సంధ్బంగా ఇండియా సిమెంట్స్ చైర్మన్, మహేంద్రసింగ్ ధోనిలు మంత్రికి స్వాగతం పలికారు.

అన్న ప్రసాద వితరణకు విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంను సందర్శించిన యాత్రికులకు దేవస్థానం అందిస్తున్న నిత్య అన్నదాన పథకానికి పలువురు భక్తులు శనివారం విరాళాలు అందించారు. నంద్యాలకు చెందిన ఈవి భాస్కర్ రెడ్డి కుటుంబం రూ.లక్ష, తిరుపతికి చెందిన కె జగదీశ్వర్ రూ.లక్ష, గుంటూరుకు చెందిన వెనుకూరు కోటిరెడ్డి 10,1000 రూపాయలను విరాళంగా దేవస్థానంకు అందజేశారు. దాతలకు శేష వస్త్రాలను ప్రసాదాలను సంబంధిత పత్రాలను అందజేయడం జరిగిందని దేవస్థానం అధికారులు తెలిపారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఢీకొట్టాల గ్రామానికి చెందిన నరసింహారెడ్డి అనే రైతును పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థకు గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల వివరాల మేరకు శనివారం నరసింహారెడ్డి గ్రామ సమీపంలో ఉన్న పంట పొలాల్లో పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. విష ప్రభావంతో ఆయన అక్కడే తీవ్ర అస్వస్థ చెందడంతో బంధువులు ఆయనను చికిత్స నిమిత్తము రుద్రవరం లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా నంద్యాలలోని ఉదయానంద్ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

దేవాలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత

- ఆళ్లగడ్డ డిఎస్‌పి సుధాకర రెడ్డి

ప్రజాశక్తి - రుద్రవరం

దేవాలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత వస్తుందని ఆళ్లగడ్డ డిఎస్పి సుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం రుద్రవరం మండలంలోని అప్పనపల్లి ప్రధాన రహదారిలో వెలసిన శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ప్రజల్లో భక్తి, ఆప్యాయత, అనురాగము, ఆధార అభిమానాలు, మానవసేవ, కలిగి ఉన్నప్పుడే సుఖశాంతులు ఉంటాయన్నారు. భక్తి భావము కలిగినప్పుడే ప్రజల సుఖశాంతులతో జీవిస్తారన్నారు. ప్రతి ఒక్కరు మానవసేవయే మాధవ సేవ భావము కలిగి ఉండాలన్నారు. ఆయన వెంట సిరివెళ్ల సిఐ చంద్రబాబు నాయుడు, ఆళ్లగడ్డ సిఐ రాజశేఖర్ రెడ్డి, రుద్రవరం ఎస్ఐ నిరంజన్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు. పూజా కార్యక్రమానికి హాజరైన డిఎస్పికి ఆలయ నిర్వహకులు సింగతల మధుసూదన్ రెడ్డి, లింగం వెంకట రంగనాయకులు శెట్టి, కానాల ఈడిగ నరసింహులు, ఓబులయ్య,ఆలయ ప్రధాన అర్చకుడు గోపి శర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరము ఆయనను ఘనంగా సన్మానించారు.

రుద్రవరం సమీపంలో వెలసిన శ్రీవాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నాడు ఘనంగా పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గోపి శర్మ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామికి కుంకుమార్చన, అభిషేకము,పంచామృత సహస్ర తులసి దళ క్షణ, కార్యక్రమాలు నిర్వహించారు. గోవింద నామ పారాయణము భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. పూజా కార్యక్రమానికి నంద్యాల ఆళ్లగడ్డ ,సిరివెళ్ల ఎర్రగుంట్ల, గాజులపల్లి, చాగలమర్రి, గ్రామాల నుంచి కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలోహాజరై ఘనంగా పూజలు నిర్వహించారు. పూజకు హాజరైన భక్తులకు అల్పాహారము ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులతోపాటుఆలయనిర్వాహకుల మధుసూదన రెడ్డి,లింగంవెంకటరంగనాయకులశెట్టి,తదితరులుపాల్గొన్నారు.



డిఎస్‌పికి జ్ఞాపికలను అందజేస్తున్న ఆలయ అధికారులు

14 నుండి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - పాణ్యం

ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు జరిగే గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని గ్రంథాలయ అధికారి బి.భాగ్యలక్ష్మి శనివారం కోరారు. ఆమె మాట్లాడుతూ వారోత్సవాలలో భాగంగా 14న బాలల దినోత్సవం, 15న పుస్తక పఠనం, 17, 18న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19న గ్రంథాలయ ఆవరణలో మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు వుంటుందన్నారు.

జర్నలిస్టులకు పక్కా గృహాలు మంజూరు చేయాలి



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మౌలాలి, జిల్లా ఉపాధ్యక్షులు మద్దయ్య యాదవ్

- ఎపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్

ప్రజాశక్తి - డోన్

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, పక్కా గృహాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి మౌలాలి, జిల్లా ఉపాధ్యక్షులు జి.మద్దయ యాదవ్‌లు పేర్కొన్నారు. శనివారం డోన్‌లో వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడుల నియంత్రణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. మండల స్థాయి నుండి వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు, కమిటీల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ బనగానపల్లె నియోజకవర్గ ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి షాషావలి, ముత్యాల శివరామయ్య ఆచారి, మాధవ స్వామి, వెంకటేశ్వర్లు, తారక్, నాగరాజు, మణిధర్, శేఖర్, జిలాని, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే అరెస్టులా ? : టిడిపి

ప్రజాశక్తి - చాగలమర్రి

రాష్ట్రంలో ఏదైనా ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా అని టిడిపి రాష్ట్ర మైనార్టిసెల్ ఉపాధ్యక్షులు అన్సర్ బాష ప్రశ్నించారు. ముస్లీంలకు ఏం మేలు చేశారని టిడిపి మైనార్టిసెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ ప్రశ్నిస్తే కనీసం ఆయన ఒక మౌల్వి అని కూడా చూడకుండా చొక్కాపట్టి ఈడ్చి అరెస్టు చేయడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు చూస్తుంటే ఈ ప్రభుత్వానికి ముస్లిం మైనార్టీలపై ప్రేమ ఉందా అని ప్రశ్నించారు. బూటకపు , కపట ప్రేమను ఒలకపోస్తున్న వైకాపా ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. ముస్లీం సోదరులపై జరుగుతున్న అన్యాయాలను ప్రజలు చూస్తున్నారన్నారు. 2024లో ముస్లిం సోదరులంతా ఐక్యంగా టిడిపికి మద్దతు తెలిపి గెలిపిస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా చాగలమర్రి పట్టణ ఉపాధ్యక్షులు షాబుల్, నాయకులు కొలిమి ఉసేన్ వళి, కొలిమి షరీఫ్, గఫార్, జెట్టి నాగరాజు, గఫార్, నూర్ బాషా,మాబులాల్,అలీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర మైనార్టిసెల్ ఉపాధ్యక్షులు అన్సర్ బాషా

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కె.వి సుబ్బారెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మల్లేశ్వర్ రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డిలు అన్నారు. స్థానిక కె.వి సుబ్బారెడ్డి జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపల్ మల్లేశ్వర్ రెడ్డి అధ్యక్షతన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి,బాలకృష్ణారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కష్టాలను అర్థం చేసుకొని వారి ఆశయ సాధన కోసం శ్రమించాలన్నారు. జీవితంలో స్థిరపడడానికి ఇంటర్ విద్య కీలకం కావున ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టు వదలని విక్రమార్కుడిలా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పదివేల రూపాయలు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కెవి సుబ్బారెడ్డి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఓబన్న, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న దృశ్యం

ప్రైవేట్ టీచర్లకు జీతాలు పెంచాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-డోన్

ప్రైవేట్ స్కూల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు జీతాలు పెంచాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తెలుగు విజయ్ కుమార్, మండల అధ్యక్షుడు అశోక్‌లు డిమాండ్ చేశారు. శనివారం డోన్ పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ స్కూల్‌కు వచ్చే ఆదాయంలో 50 శాతం కేటాయించాల్సి ఉన్నప్పటికీ ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి వారికి ఇష్టం వచ్చినట్లు రూ. 5 వేల నుంచి 10 వేల రూపాయల వరకు చాలీచాలని జీతాలు ఇస్తూ, విద్యార్థుల నుంచి మాత్రం నర్సరీకి రూ. 10 వేలు నుంచి పదవ తరగతి వరకు రూ. 25 వేల నుంచి రూ. 30 వేలు ఫీజులు, ఇతర రూపాలలో వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇంత వసూలు చేస్తున్నప్పటికీ జీతాలు ఇచ్చే విషయంలో ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రెండవ శనివారం, ఆదివారాల రోజుల్లో, ప్రభుత్వ సెలవు దినాలలో కూడా స్కూలు నిర్వహిస్తూ ఉపాధ్యాయుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇంత జరుగుతున్నప్పటికీ మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఏమాత్రం చర్యలు తీసుకోకుండా ప్రైవేట్ స్కూల్ యాజమాన్యానికే శ్రేయోభిలాషిగా వ్యవహరించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ప్రైవేట్ స్కూల్ టీచర్లకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో రాబోయే కాలంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సునీల్, సుదర్శన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల కార్యదర్శి తెలుగు విజయ్ కుమార్

వెనక బడిన ప్రాంతాలకు సిఆర్‌డిఏ చట్టం గొడ్డలి పెట్టులాంటిది

- రాయలసీమ సాగునీటి సాధన సమితి

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్ర సమగ్రాభివృద్ధిని విస్మరించి, వెనుకబడిన ప్రాంతాలకు సిఆర్‌డిఏ చట్టం గొడ్డలిపెట్టులా మారిందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. శనివారం నంద్యాలలోని నూనెపల్లె శివాలయంలో సీనియర్ న్యాయవాది బి.శంకరయ్య అధ్యక్షతన రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టులో అమరావతి రైతుల తరుపున సీనియర్ న్యాయవాదుల వాదనలు రాష్ట్రంలో మరోమారు ప్రాంతీయ ఉద్యమాలకు ఊతం ఇచ్చేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన సిఆర్‌డిఏ చట్టంపై సవరణలకు రాష్ట్ర ప్రభుత్వానికే హక్కు లేదనే హైకోర్టులో అమరావతి రైతుల వాధన విస్మయానికి గురి చేస్తుందని అన్నారు. రాయలసీమ హక్కుల పత్రం శ్రీబాగ్ ఒడంబడిక అమలుకు, రాష్ట్ర విభజన చట్టంలో రాయలసీమకు కల్పించిన హక్కుల సాధనకు ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో తోట పార్థసారథి, కొండారెడ్డి, సుబ్బారావు, రామస్వామి, విశ్రాంత ఎస్ఐ సుబ్బయ్య, మాధవరావు, వెంకటసుబ్బయ్య, రామూర్తి, నారాయణ గౌడు, సుబ్బారెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జ దశరథ రామిరెడ్డి



మాట్లాడుతున్న గ్రేటర్ రాయలసీమ నాయకులు గంగుల ప్రతాపరెడ్డి

గ్రేటర్ రాయలసీమ ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- గ్రేటర్ రాయలసీమ నాయకులు గంగుల ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

గ్రేటర్ రాయలసీమ ఏర్పాటు ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కవుల పాత్ర కీలకమైనదని గ్రేటర్ రాయలసీమ నాయకులు, మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి అన్నారు. శనివారం స్థానిక డా.రామలింగారెడ్డి కళ్యాణ మండపంలో బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ రావు శతావధాన కార్యక్రమాలు శుక్రవారం నుండి ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రేటర్ రాయలసీమ నాయకులు మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కేంద్ర కాటన్ బోర్డు మాజీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి శివప్రసాద్ రావు, బ్రాహ్మణ సంఘం నాయకులు మాధవరావు, సుబ్బారావు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా అత్తర్ జావేద్ హుస్సేన్

ప్రజాశక్తి - బనగానపల్లె



బనగానపల్లె పట్టణానికి చెందిన టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తార్ జావేద్ హుస్సేన్‌ను నందికొట్కూరు నియోజకవర్గ పరిశీలకులుగా నియమించారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాలలో ముస్లిం మైనార్టీ నియోజకవర్గ కమిటీలను ఏర్పాటు చేసేందుకు ఎన్నికల పరిశీలకులుగా ముస్లిం మైనార్టీ కమిటీలో ఉన్న ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కార్యదర్శులను రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ నియమించినట్లు తెలిపారు.

హరివరం గ్రామంలో కార్తీక వన భోజనాలు

ప్రజాశక్తి - ఉయ్యాలవాడ

మండలంలోని హరివరం గ్రామ సమీపంలో ఆంజనేయస్వామి గుడి దగ్గర సొసైటీ చైర్మన్ పల్లె మహేశ్వర్ రెడ్డి, పల్లె వెంకట శివారెడ్డి, బోరెడ్డి శేఖర్ రెడ్డి, జి శంకర్ రెడ్డి, సి హుస్సేన్ రెడ్డి గ్రామస్తుల ఆధ్వర్యంలో కార్తీక వనభోజనంను శనివారం నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, శివ స్వాములు, మహిళలు పాల్గొన్నారు. ఎంపీపీ బుడ్డ భాగ్యలక్ష్మి పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

లోక్ అదాలత్‌లో 780 కేసులు పరిష్కారం

- రూ.కోటి పైగా రికవరీ

ప్రజాశక్తి- నంద్యాల లీగల్

నంద్యాల జిల్లా కోర్టులో మూడో అదనపు జిల్లా జడ్జి వాసు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలతో 780 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిష్కరించిన వాటిలో 688 క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు 93 ఉన్నాయని తెలిపారు. ఎంవిఒపి 34 కేసులకు రూ.53,53,000, ఇపి 17 కేసులకు రూ.89,86,500, ఒఎస్ కేసుల్లో రూ.2,00,000, ఎన్ఐ యాక్ట్, పిఎల్‌సి ద్వారా రూ.7,30,000 రికవరీ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేజిస్ట్రేట్ అర్చన, నంద్యాల డిఎస్‌పి మహేశ్వర్ రెడ్డి, టూటౌన్ సిఐ ప్రభాకర్ రెడ్డి, సిఐలు, ఎస్ఐలు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసరెడ్డి, విజయశేఖరరెడ్డి, రామకృష్ణారెడ్డి, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

ఆందోళన రేపుతున్న తుఫాను

ప్రజాశక్తి - చాగలమర్రి

వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాను కారణంగా శనివారం కారుమబ్బులు కమ్ముకోవడంతో పత్తి, శనగ, మొక్కజొన్న రైతులు భయాందోళనకు గురౌతున్నారు. పత్తికి మొగ్గలు వస్తున్న సమయంలో ఈ వాతావరణం రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. చిరుజల్లులకు పత్తి పిందెలు, మొగ్గలు నేలరాలుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చాగలమర్రి, మద్దూరు, పెద్దబోదనం, చిన్నబోదనం, తిప్పనపల్లె గ్రామాల సమీపంలోని సర్వీసు రహదారుల్లో ఆరబెట్టుకున్న మొక్క జొన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పట్టలు కప్పుతున్నారు.



మొక్కజొన్న ధాన్యంపై పట్టలు కప్పుతున్న రైతులు